క్లుప్తంగా

అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు అపోలో వైద్యుడు



కాన్ఫరెన్స్‌లో వివరిస్తున్న డాక్టర్ హేమంత్ వర్మ

ఆరిలోవ : అంతర్జాతీయ స్థాయిలో యూకేలో జరిగే అంకాలజీ సభ (కాన్ఫరెన్స్)లో పాల్గొనేందుకు ఆరిలోవ హెల్త్ సిటీలోని అపోలో వైద్యుడు డాక్టర్ హేమంత్ వర్మకు అవకాశం లభించింది. దీంతో ఆయన ఈ నెల 14న యూకే బయలుదేరి వెళ్లారు. అక్కడ వారం రోజులపాటు జరుగుతున్న అంతర్జాతీయ అంకాలజీ సభలో ఆయన తన ఉపన్యాసం ఇచ్చినట్లు మంగళవారం తెలిపారు. ఈ నెల 17న ప్రారంభమైన సభ 23తో ముగియనుందన్నారు. ఇది అరుదైన అవకాశమని, తాను అంకాలజీ విభాగంలో అందించిన సేవలను గుర్తించి అవకాశం ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అపోలో వైద్యులు అభినందనలు తెలిపారు.

శివాజీపార్కు రోడ్డులో భూగర్భ డ్రైనేజీ లీక్



శివాజీపార్కు ఎదురుగా రోడ్డుపై లీకవుతున్న డ్రైనేజీ

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పరిధి శివాజీపార్కు రోడ్డులో భూగర్భ డ్రైనేజీ లీకవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. శివాజీపార్కు ఎదురుగా లీకవుతున్న మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో దుర్వాసనతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి సహస్రనామార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 1001 నామాలతో స్వామికి సహస్రనామార్చన జరిపి, ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తరలించి... వాహనాలు వదిలేశారు..!

- కొత్త భవనంలోకి ఆరిలోవ పోలీస్ స్టేషన్
- పాత స్టేషన్ వద్ద వదిలేసిన వందలాది వాహనాలు
- ఆ భవనం వెనుకే మూడు సచివాలయాలు
- అక్కడికి వెళ్లేందుకు స్థానికులకు అడ్డంకిగా వాహనాలు
- వాటిని తరలించి మార్గం క్లియర్ చేయాలంటున్న స్థానికులు



ఆరిలోవ పాత పోలీస్ స్టేషన్ పక్కన ఉర్వీ చారిటబుల్ ట్రస్టు కేంద్రం ఆవరణలో నిలిపిన వాహనాలు



పాత పోలీస్ స్టేషన్ వెనుక, సచివాలయాల ఆవరణలో నిలిపిన కార్లు, ఆటోలు, బైక్‌లు

ఆరిలోవ :

ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఇరుకు గది నుంచి బయటపడి విముక్తి పొందింది. ఇక్కడి గదిలో పని చేసిన అధికారులు, సిబ్బందికి ఊరట కలిగింది. అయితే స్థానికులకు మాత్రం ఇంకా ఇబ్బందులు తొలగలేదు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ఆవరణలో బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని నిర్మించిన కొత్త పోలీస్ స్టేషన్ భవనం గత నెల 8న ప్రారంభమైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆరిలోవ పోలీస్ స్టేషన్ సిబ్బంది కొత్త భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. విశాలమైన గదులు, మరో అర ఎకరానికి పైగా ఖాళీ స్థలంతో ప్రశాంతమైన వాతావరణంలో పోలీస్ స్టేషన్ ఉంది. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ... పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో మాత్రం వందల కొద్దీ వాహనాలు గుట్టలుగా ఉన్నాయి. వాటిని మాత్రం కొత్త స్టేషన్ వద్దకు పోలీసులు తరలించకుండా వదిలేశారు. దీంతో స్థానికుల సమస్య మాత్రం పరిష్కారం కాకుండా మిగిలిపోయింది. ఇక్కడ వాహనాలు సుమారు 11 సంవత్సరాల నుంచి నిలిపి ఉంచారు. దీంతో వాటి భాగాలు పాడయ్యాయి. ఆ వాహనాలు పనికిరానివిగా మిగిలాయి. కొన్ని భూమిలోకి కూరుకుపోతున్నాయి.

సచివాలయాలకు వెళ్లేందుకు అడ్డుగా...

రోడ్డు ప్రమాదాలకు, దొంగతనానికి గురైన వాటితో పాటు ఎలాంటి పత్రాలు లేకుండా పోలీసులకు పట్టుబడిన వాహనాలు చాలా సంవత్సరాల నుంచి ఇక్కడ నిలిపి వదిలేశారు. ఈ పోలీస్ స్టేషన్ వెనుక 12వ వార్డుకు చెందిన 1, 2, 21 నంబరు గల మూడు సచివాలయాలు నిర్వహిస్తున్నారు. ఆయా సచివాలయాలకు అవసరాల కోసం రోజూ వందల మంది వస్తుంటారు.

ఆయా సచివాలయాలకు పాత పోలీస్ స్టేషన్ పక్క నుంచి వెళ్లాలి. ఆయా సచివాలయాలకు వెళ్లే రహదారి పోలీసులు పట్టుకొన్న వాహనాలతో నిండిపోయింది. సంవత్సరాలు కొద్దీ అవి పేరుకుపోయాయి. దీంతో ఆయా సచివాలయాలకు వెళ్లే దారి కూడా లేకుండాపోయింది. వాహనాలు నిలపగా మిగిలిన సందు లాంటి దారి నుంచి సచివాలయాలకు స్థానికులు వారి పనులు మీద వెళ్లాల్సి వస్తోంది. విధులు నిర్వహించేందుకు వచ్చే సచివాలయాల సిబ్బంది కూడా వారి వాహనాలను అక్కడ నిలుపుకోవడానికి వీలులేకుండా పోయింది. దీంతో పాటు ఆవరణమంతా తుప్పు పట్టిన వాహనాలతో అస్తవ్యస్తంగా మారింది.

కొత్త భవనంలోకి పోలీస్ స్టేషన్ తరలించినా ఇక్కడ తుక్కుగా మారిన వాహనాలను మాత్రం తరలించకపోవడంపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ఈ వాహనాలను వెంటనే ఇక్కడి నుంచి తరలించి ఆ స్థలాన్ని శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



తుప్పు పట్టి భూమిలోకి కూరుకుపోయిన కార్లు, ఆటోలు

సచివాలయాలకు దారిలేదు

పాత పోలీస్ స్టేషన్ భవనం వెనుక ఉన్న సచివాలయాలకు వెళ్లడానికి సరైన దారి లేకుండా పోయింది. మేము 21వ నంబరు సచివాలయం పరిధిలోకి వస్తాం. ఏదైనా పనిమీద మా సచివాలయానికి వెళ్లడానికి ఇక్కడ నిలిపిన వాహనాలు మధ్య ఇబ్బంది పడుతున్నాం. వాహనాలు అడ్డుగా ఉంటున్నాయి. పోలీస్ స్టేషన్‌ను కొత్త భవనంలోకి తరలించడం వల్ల వాహనాల సమస్య పోతుందని అనుకొన్నాం. కానీ ఆ సమస్య ఇంకా తీరలేదు.

– ఎస్.గంగాధరరావు, సుందరయ్యకాలనీ

వాహనాలు తరలించాలి

పాత పోలీస్ స్టేషన్ భవనం వెనుక వైపు ఉన్న వాహనాలను పోలీసులు వెంటనే కొత్త భవనం వద్దకు తరలించాలి. ఇక్కడ నిలిపిన వాహనాల వల్ల పనుల మీద సచివాలయాలకు వెళ్లడానికి దారి లేకుండా పోయింది. పోలీస్ అధికారులు దీనిపై దృష్టి సారించి వాహనాలు తరలించాలి. సచివాలయాలకు వెళ్లే మార్గాన్ని రాకపోకలకు వీలుగా శుభ్రం చేస్తే వేలాది మందికి, సిబ్బందికి ఉపయోగకరంగా ఉంటుంది.

– కె.మురళి, నెహ్రూనగర్

సమాజ అభివృద్ధికి విద్య కీలకం



జేఎన్‌టీయూ కాకినాడ వీసీతో ఏయూ వీసీ, తదితరులు

మద్దిలపాలెం : సమాజ అభివృద్ధికి విద్య కీలకమని జేఎన్‌టీయూ కాకినాడ వీసీ ఆచార్య సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు ఓ క్లస్టర్‌గా పనిచేయాలని సూచించారు. ప్రతి విశ్వవిద్యాలయంలో అనుసరించే అత్యుత్తమ విధానాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయాల ప్రతిష్టను పెంచేలా, బోధన విధానాన్ని బలోపేతం చేసే దిశగా పనిచేయాలని కోరారు. విశ్వవిద్యాలయాలు కలిసి ముందుకు సాగుతూ ప్రగతి సాధించాలని చెప్పారు. బోధన, అభ్యసన, పరిశోధన రంగాల్లో అవగాహన ఒప్పందాలు చేసుకుందామని, సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించే దిశగా కలిసి పని చేయాలని ఏయూ అధికారులను ఆయన కోరారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ సంయుక్త భాగస్వామ్య కోసం తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి పాల్పడిన యువకుడి అరెస్ట్

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ క్రైమ్ పోలీసు స్టేషన్ పరిధిలోని మద్దిలపాలెం ఆర్టీసీ డిపో పార్శిల్ కౌంటర్ వద్ద దొంగతనానికి పాల్పడిన కట్టమ్మరెడ్డి విజయకుమార్ (22)ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ వివరాలను ద్వారకా క్రైమ్ ఎస్‌ఐ చక్రధర్‌రావు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం... చిటికిల చెల్లంనాయుడు మద్దిలపాలెం ఆర్టీసీ డిపో పార్శిల్ కౌంటర్ వద్ద కళాసీగా పనిచేస్తున్నాడు. 19వ తేదీ రాత్రి కౌంటర్‌లో నిద్రపోగా ఉదయం లేచి చూసేసరికి అతని సెల్‌ఫోన్, రూ.19,300 నగదుతో పాటు మరో కళాసీ ఫోన్ కనిపించ లేదు. దీంతో సీసీ కెమెరా ఫుటేజ్‌ని పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి వారు నిద్రిస్తున్న సమయంలో దొంగతనం చేసినట్లు గుర్తించారు. దీంతో ఎంవీపీ నేరవిభాగం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అనంతరం దర్యాప్తు ప్రారంభించగా కేఆర్‌ఎం కాలనీ సమీపంలో కట్టమ్మరెడ్డి విజయ్‌కుమార్ అనుమానాస్పదంగా సెల్ ఫోన్ అమ్మడానికి ప్రయత్నిస్తుండగా ఎస్‌ఐ రవికుమార్ బృందం అతన్ని పట్టుకొని అరెస్ట్ చేసింది. అతని వద్ద నుంచి ఫోన్‌తోపాటు రూ.17,300 నగదు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యంత్రానికి తుప్పు.. తాగునీటికి ఇక్కట్లు

ఏయూ క్యాంపస్ : పరిశుభ్రమైన తాగునీరు అందించాలనేది జీవీఎంసీ లక్ష్యం. ఇందుకోసం ప్రత్యేకంగా యంత్రం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ యంత్రం తుప్పుపట్టి ప్రమాదకరంగా మారింది. దీంతో అందులో నుంచి వచ్చే నీటిని తాగడానికి పర్యాటకులు ఇష్టపడటం లేదు. వైఎంసీఏ నుంచి పార్క్ హోటల్ కూడలికి వెళ్లే మార్గంలో ఈ యంత్రం ఉంది. సముద్ర తీరంలో ఇనుము పోతతో చేసిన వాటర్ కూలర్ ఏర్పాటు చేయడంతో అది తుప్పు పట్టి ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. నిత్యం వేలాది మంది పర్యాటకులు సంచరించే ఈ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసినప్పటికీ... నిర్వహణ లోపంతో అది తుప్పుపట్టి నిరుపయోగంగా మారిపోయంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



బీచ్ రోడ్డులో తుప్పు పట్టిన వాటర్ కూలర్

ఆక్రమణలపై రెవెన్యూ ఉక్కు పాదం

- రూ.6 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి స్వాధీనం
- 8వ వార్డు కీలక టీడీపీ నాయకుడి కనుసన్నల్లోనే ఆక్రమణలు



ప్రభుత్వ స్థలంలో పాకలను తొలగిస్తున్న అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. టీడీపీ నేత ఆక్రమణకు చెక్ పెట్టారు. వివరాలివి.. రామానాయుడు ఫిల్మ్ స్టూడియో దరి తిమ్మాపురంలో సర్వే నెంబరు 379లో సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలంపై 8వ వార్డు టీడీపీ కీలక నేత కన్నేశారు. సుమారు రూ.6కోట్లకు పైగా అంచనా విలువున్న స్థలం ఆక్రమణకు స్కెచ్ వేశాడు. ముందుగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి స్థానికులచేత ఓ కమ్మల పాక వేయించి, నివాసం ఏర్పాటు చేశాడు. ఈ స్థలాన్ని త్వరలో బేరం పెట్టేందుకు సిద్ధమయ్యాడు. అయితే, స్థానికుల ఫిర్యాదుతో కథ అడ్డం తిరిగింది. ఈ ఆక్రమణపై రెవెన్యూ అధికారులకు పలువురు సమాచారం అందించారు. దీంతో ఆర్డీవో సంగీత్ మాథూర్ వెంటనే స్పందించి కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలానికి రక్షణ కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన పూరి గుడిసెలను తహసీల్దార్ పాల్‌కిరణ్ ఆధ్వర్యంలో, భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆర్ఐ కిషోర్ పర్యవేక్షణలో మంగళవారం నేలమట్టం చేశారు. వీటికి సమీపంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించారు. అయితే రెండు రోజుల క్రితం ఈ ఆక్రమణలను తొలగించేందుకు ఆర్ఐ కిషోర్ తమ సిబ్బందితో వెళ్లగా, ఆక్రమణదారులు అధికారులపై దౌర్జన్యం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ కె.భాస్కర్ పర్యవేక్షణలో 20 మంది పోలీసులతో ప్రవేశించి ఈ 1500 గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగించి, స్వాధీనం చేసుకున్నారు.

మద్యానికి బానిసై యువకుడి మృతి

పీఎం పాలెం: మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్న ఉదంతంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైంది. సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. పీఎం పాలెం ఆఖరు బస్టాప్ దరి బీ–2 కాలనీలోని బ్లాక్ నంబరు–15లో మకాన గోవిందరాజు (27) భార్య స్వాతితో కలిసి నివసిస్తున్నాడు. వీరికి ఇటీవలే వివాహం కాగా, బీ–2 కాలనీలో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. దినసరికూలి కూలి అయిన గోవిందరాజు మద్యానికి బానిసయ్యాడు. రోజూ సాయంత్రం మద్యం సేవించి వచ్చి, భార్యను వేధించేవాడు. సోమవారం రాత్రి 9 గంటలకు వచ్చి మద్యం మత్తులో స్వాతిని వేధించడంతో, ఆమె భరించలేక సమీపంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు భార్య ఇంటికి వచ్చి చూడగా గోవిందరాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, వారు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

రామకృష్ణాపురం క్వారీ చెరువు ఆక్రమణ

- మట్టితో కప్పి ఆక్రమించేస్తున్న టీడీపీ నాయకుడు
- చర్యలకు వెనుకాడుతున్న జీవీఎంసీ అధికారులు





ఆక్రమణదారులు మట్టితో పలుచోట్ల పూడ్చిన రామకృష్ణాపురం క్వారీ చెరువు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురంలో టీడీపీ నాయకుల ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ఇక్కడ ఖాళీ స్థలాలతోపాటు ఆక్రమణదారులు క్వారీ చెరువును కూడా వదలడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొందరు స్థానిక టీడీపీ నాయకులు ఈ గ్రామాన్ని ఆనుకుని ఉన్న క్వారీ చెరువుపై కన్నేశారు. ఇప్పటికే ఈ క్వారీ చెరువులోని కొంత భాగాన్ని మట్టితో పూడ్చి ఆక్రమించేశారు. ఇప్పుడు కొద్ది రోజులుగా చెరువును మరింత పూడ్చి స్థలాలుగా చదును చేస్తున్నారు. వాటిని విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. ఆక్రమణలకు పాల్పడుతున్న వారిలో ఓ టీడీపీ నాయకుడు తాను ఎమ్మెల్యే వెలగపూడి తాలూకా అంటూ బెదిరించడంతో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆయన జోలికి వెళ్లడానికి వెనుకాడుతున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు అడగడం లేదని నాలుగు రోజుల క్రితం గ్రామ సంఘం పెద్దలు అక్కడి ఆక్రమణను అడ్డుకోవడంతో ఆక్రమణదారుడి అనుచరులు తిరగబడి గొడవకు దిగారు. ఈ గొడవ ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు చేరింది. దీంతో ఆరిలోవ పోలీసులు పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఇక్కడ క్వారీ చెరువును పూడ్చడం వల్ల వర్షాకాలంలో వరద నీరు గ్రామంలోని నివాసాల్లోకి చేరే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువును పూడ్చకుండా, ఆక్రమించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ మేరీ ప్రశాంతి

పెందుర్తి: నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జోన్–2 డీసీపీ మేరీ ప్రశాంతి అన్నారు. గంజాయి నిర్మూలనలో భాగంగా గంజాయి అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామన్నారు. పెందుర్తి సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సీఐ కేవీ సతీష్‌కుమార్, ఎస్ఐలు స్వామినాయుడు, భాస్కరరావు, దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రహణం మొర్రిపై కార్యక్రమాలు

బీచ్‌రోడ్డు : గ్రహణం మొర్రి అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్మైల్ ట్రైన్ ఇండియా రీజినల్ డైరెక్టర్ మమత తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుడ్‌విల్ అంబాసిడర్‌గా సినీ నటి పావని గంగిరెడ్డిని నియమించినట్లు పేర్కొన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఆమె నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా గ్రహణం మొర్రితో బాధపడుతున్న వ్యక్తులు, ఆయా కుటుంబాలకు ధైర్యం ఇవ్వడానికి స్మైల్ ట్రైన్ ప్రారంభించినట్లు తెలిపారు.

సమాజవాది, పోరాటయోధుడు దాశరథి



మాట్లాడుతున్న సాహితీ విశ్లేషకుడు డాక్టర్ డీవీ సూర్యారావు

సీతంపేట: తెలంగాణ ఉద్యమ కవి, దివంగత దాశరథి కృష్ణమాచార్య శత జయంత్యుత్సవ సభ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఘనంగా జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, విశ్లేషకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు సభాధ్యక్షత వహించారు. గత ఏడాది ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరిగిన దాశరథి ఉత్సవాలను గుర్తుచేసుకుంటూ తెలంగాణ కవి అయినప్పటికీ దాశరథి తెలుగు తల్లిని ప్రస్తావించిన వైనాన్ని కొనియాడారు. ప్రముఖ సాహితీ విశ్లేషకులు డాక్టర్ డీవీ సూర్యారావు దాశరథి ఉద్యమ సాహిత్యంపై లోతైన విశ్లేషణ చేశారు. 'ఆ చల్లని సముద్ర గర్భం' పద్యంతో ప్రారంభించి, దాశరథి రచనలన్నింటినీ స్పృశించారు. కవికి ప్రాంతీయ భేదం ఉండదని ఉద్ఘాటించిన ఆయన, దాశరథిని ఒక సమాజవాది, పోరాటయోధుడిగా అభివర్ణించారు. 'దాశరథి ఒక శాంతి విప్లవం. జైల్లో ఉండి కూడా కవిత్వం మరువని మహోన్నత సాహితీవేత్త' అని ప్రశంసించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న దాశరథి ప్రఖ్యాత వాక్యాన్ని సోదాహరణంగా వివరించారు. రైతుల గురించి దాశరథి కవిత్వాన్ని వివరిస్తూ, ఆయన 'దిగిపో' అని గర్జించిన ధైర్యశాలి అని, తిమిరంతో సమరం చేసిన మహాకవి అని విశ్లేషించారు. ప్రఖ్యాత వ్యాఖ్యాత రాంభట్ల నృశింహశర్మ దాశరథి రాసిన చలన చిత్ర గీతాలపై మాట్లాడారు. 'ఆ రజనీకర బింబం' పాటతో తన ప్రసంగాన్ని ప్రారంభించి, 'గరళము నుంచి సరళమునకు సాహిత్యాన్ని దించిన కవి దాశరథి' అని అభివర్ణించారు. దాశరథి సినీ గీత రచనను సభకు పరిచయం చేశారు. అరసం ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు మాట్లాడుతూ దాశరథి కవిత్వంలో మానవతా కేతనం ఎగురుతుందని గుర్తుచేశారు. కవి బసు పోతన సభా ప్రారంభంలో స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొని దాశరథి కృష్ణమాచార్య సాహిత్యం, ఆయన సేవలను స్మరించుకున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగండి



మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

సీతంపేట: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని ఫోర్త్‌టౌన్ సీఐ వెంకటరావు అన్నారు. మంగళవారం అక్కయ్యపాలెం ఎన్జీటీఎస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌ను తన సిబ్బందితో కలిసి సందర్శించిన ఆయన, ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లో గేమ్స్, రీల్స్‌తో కాలక్షేపం చేస్తూ చదువును నిర్లక్ష్యం చేయవద్దని హితవు పలికారు. సమయపాలన పాటిస్తూ, ప్రతిరోజూ క్రమం తప్పకుండా స్కూల్‌కు హాజరై టీచర్లు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినాలని, పాఠ్యాంశాలలోని సందేహాలు వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ మంచి మార్కులు సాధించి ఉన్నతంగా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు సేవించేవారికి దూరంగా ఉండాలని కూడా ఆయన విద్యార్థులకు సూచించారు. పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులు రత్నం, జ్యోతి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి. విశ్వనాథం, ఉపాధ్యాయులు సునీత, గ్లోరీ, హైమ, నిర్మల, కిశోర్, అప్పారావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

స్నేహితులతో సరదాగా కాసేపు..



ఏయూ క్యాంపస్ : ఉద్యోగ జీవితం.. కుటుంబ బాధ్యతలు.. వీటి కోసమే ఎంతో విలువైన సమయం గడిచిపోతుంది. మలి సంధ్యలో కాస్త విరామం దొరికినప్పటికీ ఓపిక తగ్గిపోతుంది. అటువంటి సమయంలో సదరాగా కాసేపు గడపడానికి, నాలుగు కబుర్లు చెప్పకోవడానికి ఒక స్నేహితుడు కావాలి. మన మనసులోని భావాలను స్వేచ్ఛగా పంచుకోవడానికి, కాసేపు సరదాగా గడపడానికి మంచి స్నేహబంధం అవసరం. అటువంటి స్నేహితులే బీచ్‌రోడ్డులో కనిపిస్తుంటారు. టీయూ 142 యుద్ధ విమానం ఎదురు పార్కులో సాయంత్రం కొద్ది మంది కూర్చుని నిత్యం సరదాగా కబుర్లు చెప్పుకుంటారు. వారు గడిపే కొద్ది సమయం వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు.